ప్రజాశక్తి
సోమవారం 7 ఏప్రిల్ 2025
8 పేజీలు
విశాఖపట్నం
అనకాపల్లి

ఏదయా మీ దయ..!

◆ తాగునీటికి ప్రజల అవస్థలు ◆ స్వయంభూవరంపై ముఖం చాటేసిన ఎన్‌టిపిసి
◆ సిఎస్ఆర్ నిధులతో ఆర్ఒ ప్లాంట్ పెట్టేందుకు విముఖత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

రెండు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను నెలకొల్పిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి) ప్లాంట్ కాలుష్యంతో తాగునీటికి ఇబ్బందిపడుతున్న స్వయంభూవరం ప్రజలపై కనీస జాలి చూపడంలేదు. పశువులను కడగడానికి కూడా వినియోగించడానికి పనికిరాని విధంగా బోర్లు, బావుల నీరు ఇక్కడ కలుషితమైంది. ఎన్‌టిపిసికి ఆనుకొని పరవాడ మండలం, కలపాక పంచాయతీ స్వయం భూవరం వుంది. ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టిపిసి వస్తుందంటే ఉపాధి దొరుకుతుందని ప్రజలు భావించి నాడు భూములిచ్చారు. ఆ ఉపాధి లేకపోగా వ్యవసాయం చేసుకొని బతికే బతుకు ఛిద్రమైంది. తీవ్రమైన కాలుష్యంతో బాధపడుతున్న స్వయం భూవరం ప్రజలు గ్రామాన్ని తరలించి తమ ప్రాణాలు కాపాడాలని ఎంతోకాలంగా కోరుతున్నారు. ఎన్‌టిపిసి కూలింగ్ టవర్ల నుంచి వచ్చే ఉప్పు తుంపర్లతో ఇళ్లు దెబ్బతింటున్నాయి. పంటలు పండడంలేదు. జనం వివిధ వ్యాధులతో బాధపడుతున్నారు. ఊరులో తాగునీరు లేక, వెన్నెలపాలెం నుంచి నీరు సక్రమంగా సరఫరాకాక వెన్నెలపాలెంలో నీటి టిన్నులు కొనుక్కొని కాలం గడపాల్సిన దుస్థితి ఆ గ్రామానికి ఎదురైంది. బూడిద, కూలింగ్ టవర్ల నుంచి వస్తున్న ఉప్పు నీటితో ఊర్లో వుండలేక, వూరు విడిచివెళ్లలేక మధ్యలో నలిగిపోతున్నారు.

ప్రభుత్వాలు, ఎంపీ, ఎమ్మెల్యేలు ఎంతమంది మారినా వారి కష్టాలు పోలేదు. బొగ్గు వినియోగంలో మిగతా 2లో..

స్వయంభూవరానికి ఆనుకుని ఉన్న ఎన్‌టిపిసి

కాళ్ల వంకర సమస్యతో బాధపడుతున్న తాతబాబు

మిట్టల్ ప్లాంట్‌లో 20 వేల ఉద్యోగాలొస్తే..

విశాఖ ఉక్కులో తొలగింపులు ఎందుకు ?

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నక్కపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న మిట్టల్ స్టీల్ ప్లాంట్‌లో 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి 20 వేల ఉద్యోగాలు వస్తాయని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులను ఎందుకు తొలగిస్తోందో చెప్పాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న మిట్టల్ స్టీల్ ప్లాంట్‌లో 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి 20 వేలు ఉద్యోగాలు కల్పించడం వాస్తవమైతే, అదే సామర్థ్యంతో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించబడి, పాత సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి 22 వేల మంది మాత్రమే కార్మికులు ఉన్నారని, మరి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని రెండు వేల మందికిపైగా పర్మనెంట్ కార్మికులను, ఐదువేల మందికిపైగా కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం ఎందుకని ప్రశ్నించారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందని దుష్ప్రచారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. నీరు, విద్యుత్ వంటి విషయాల్లో రాయితీలు ప్రకటించి మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు లాభం చేకూరుస్తున్నారన్నారు. అదే సమయంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు ప్రధానమైన రా మెటీరియల్‌ను వివిధ దేశాల నుంచి తెచ్చుకునేందుకు, చేసిన ఉత్పత్తులను వివిధ దేశాలలో అమ్ముకునేందుకు అవసరమైన గంగవరం పోర్టును ప్రైవేటు వారికి అప్పగించి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు మొండి చేయి చూపించి నష్టాలపాలు చేస్తున్నారన్నారు. తాజాగా నక్కపల్లిలో మిట్టల్ ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్ కోసం పోర్టు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం ప్రైవేట్ వారికి లాభాలు చేకూర్చేందుకేనని కుమార్ అన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. స్టీల్ ప్లాంట్‌లో అక్రమంగా తొలగిస్తున్న కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేటికీ ఎనిమిది వేల మంది నిర్వాసితులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని వారందరికీ ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో 5500 ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని ప్రకటించినందున మిగతా 2లో..

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

▶ వార్త 7లో..

35 ఏళ్ల తరువాత కుటుంబం చెంతకు..

▶ వార్త 2లో..

నగదు పరిహారం చెల్లించాలి

▶ వార్త 5లో..

అధికారులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు గనిశెట్టి

మృతుడు అప్పలనాయుడు (ఫైల్)

ఫార్మాలో విషవాయువు లీక్

కార్మికుడు మృతి

వార్త మెయిన్‌లో..

కెజిహెచ్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్

'ప్రజాశక్తి'తో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కెజిహెచ్‌లో అన్ని విభాగాల పరిపాలనను గాడిలో పెట్టేందుకు త్వరలోనే కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు కెజిహెచ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన అడ్మినిస్ట్రేటర్ పోస్టులో ఇటీవల నియమితులైన డిప్యూటీ కలెక్టర్ బివి.రమణ అన్నారు. ఆయన 'ప్రజాశక్తి'తో ముచ్చటిస్తూ పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

కెజిహెచ్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది ?

కెజిహెచ్‌లో పరిపాలనా పరంగా అనేక ఇబ్బందులు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఇటీవల విశాఖ జిల్లా పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి కెజిహెచ్‌లోని రోగులకు అందించే సేవలు, భద్రత విషయాలపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చితో సమీక్షించారు. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశాల మేరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. త్వరలోనే ఇది అమల్లోకి వస్తుంది.

కమాండ్ కంట్రోల్ సెంటర్ వల్ల ప్రయోజనం ఏంటి ?

కెజిహెచ్‌కు వస్తున్న రోగులు, వారి సహాయకులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందివ్వడం కోసం, అలాగే తగిన మౌలిక

సదుపాయాలను కల్పించడం కోసం, పటిష్ట చర్యలు తీసుకోవడం కోసం ఈ సెంటర్ దోహదపడుతుంది.

కెజిహెచ్‌లో పసిపిల్లల అపహరణ వంటి దుశ్చర్యలు ఇటీవల జరగడానికి కారణాలేంటి ?

గతంలో తల్లి చెంతన ఉన్న శిశువును అపహరించారు. ఇటీవల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సమస్యలపై ఇటీవల ఆందోళనకు దిగిన స్వయంభూవరం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ఏదయా మీ దయ..!

విడులయ్యే మెర్క్యురీ, ఆర్సినిక్, కాడ్మియం, లెడ్ వంటి వాటితో ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. అయినా, ఈ గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించడానికి ఎన్‌టిపిసి ముందుకురావడంలేదు. స్వయంభూవరంలో ఎన్‌టిపిసి కాలుష్య సమస్య వుందని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఇటీవల గుర్తించారు. సిఎస్ఆర్ నిధులతో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎన్‌టిపిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ సిఎస్ఆర్ నిధులతో తాగునీటి సౌకర్యం కల్పించడానికి సానుకూలత చూపలేదు. వాస్తవానికి పరిశ్రమ ప్రభావిత గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద నిధులు కేటాయించి ఖర్చు చేయాలి. కానీ తాగునీటికి అనేక అవస్థలు పడుతున్న స్వయంభూవరంలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్‌టిపిసి నిధులు ఇవ్వడంలేదు. స్థానికులు కూడా అనేకసార్లు తాగునీటి సమస్యను అధికారులకు తెలిపారు. ప్రజా ప్రతినిధుల చెప్పిన చోట సిఎస్ఆర్ నిధులు ఖర్చుచేసే ఎన్‌టిపిసి స్వయంభూవరంపై కక్షకట్టినట్లు వ్యవహరిస్తోంది. ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా అలాగే వున్నారు. స్వయంభూవరంలో తాగునీటికి నిధులు ఖర్చు చేయడంలేదు.

సిపిఎం నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రలో ఎన్‌టిపిసి కాలుష్య తీవ్రతను స్వయంభూవరం, సోమినాయుడుపాలెం ప్రజలు ఆ పార్టీ నాయకులకు వివరించారు. స్వయంగా ప్రజల బాధలను చూసిన నాయకులు ఆ రెండు గ్రామాలను తక్షణమే తరలించాలని, అంతవరకు తాగునీటి సౌకర్యం కల్పించాలని పరవాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద బాధితులతో ధర్నా నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి గ్రామాన్ని సందర్శించి, సిఎస్ఆర్ నిధులతో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎన్‌టిపిసి అధికారులను కోరినా వారి నుంచి సానుకూల స్పందన కరువైనట్లు తెలిసింది.

కెజిహెచ్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్

శిశువులు తారుమారు అయ్యారు. దీనికి ప్రధాన కారణం తగిన నిఘా లేకపోవడం. అలాగే కొన్ని దొంగతనాలు కూడా చోటు చేసుకున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని 220 సిసి కెమెరాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. అన్ని వార్డుల్లో, రద్దీ ప్రాంతాలలో, సిఎస్ఆర్ బ్లాక్, సూపర్ స్పెషాలిటీ విభాగాలు, కార్యాలయ ఆవరణ, నర్సింగ్ సెక్షన్ వంటి ప్రాంతాల్లో నిఘాను పటిష్టం చేయడం కోసం వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

కెజిహెచ్ లో ఫైళ్ల క్లియరెన్స్ ఎలా ఉంది ?

ఈ సమస్యను పరిష్కరించడంలో భాగంగా పక్కాగా ఈ- ఆఫీసు అమలు చేయడానికి నిర్ణయించాం. కోర్టు కేసులకు సంబంధించిన ఫైళ్లు మినహా మిగిలిన అన్ని ఫైళ్లను విధిగా ఈ-ఆఫీసులో పెట్టడం జరుగుతుంది.

పరిపాలనా విభాగం పరిస్థితి ఏంటి ?

కెజిహెచ్ పరిపాలనా విభాగంలోని హెచ్ఆర్ విభాగాన్ని ఇక్కడి నుంచి వేరు చేసి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పరిధికి విలీనం చేయనున్నాం.

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యంపై ఏమంటారు?

ఇందులో కొంత వాస్తవం లేకపోలేదు. ఈ జాప్యాన్ని నివారించడానికి, ఆధునిక విధానాన్ని అమలు చేస్తున్నాం.

సెక్యూరిటీ అమలులో లోపాలున్నాయన్న విమర్శలపై ఏమంటారు ?

ఈ సమస్యను పరిష్కరించడం కోసం పోలీస్ పోస్టు, అవుట్ పోస్టులను పటిష్టంగా అమలు చేస్తాం. సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను పెంచడం ద్వారా, పరిష్కారానికి మార్గం ఉంటుంది. అలాగే శానిటేషన్‌పై కూడా ప్రత్యేకమైన దృష్టి సారిస్తాం.

విశాఖ ఉక్కులో తొలగింపులు ఎందుకు ?

ఆ ఖాళీలను నిర్వాసితులు, నిరుద్యోగ యువతతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బొకారోలో జరిగినటువంటి నిర్వాసిత ఉద్యమాలు విశాఖపట్నంలో కూడా తలెత్తే ప్రమాదం ఉందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్టీల్ యాజమాన్యం, స్టీల్ మంత్రిత్వ శాఖ చేస్తున్న దుర్మార్గాలకు అడ్డుకట్టు వేసి కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగాలను తొలగించకుండా, వారి కుటుంబాలను ఆదుకునే విధంగా తగు చర్యలు చేపట్టడం ద్వారా నిరవధిక సమ్మెను నివారించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

35 ఏళ్ల తరువాత కుటుంబం చెంతకు..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాంచీకి చెందిన దశరథ్ అనే వ్యక్తి మానసిక వ్యాధితో కుటుంబానికి దూరమై 35 సంవత్సరాల తర్వాత విశాఖకు చెందిన ఎయిటిడి స్వచ్ఛంద సంస్థ కృషి ఫలితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేరుకున్న సంఘటన ఇది. ఎయిటిడి కార్యదర్శి ప్రగడ వాసు ఆదివారం మీడియాకు తెలిపిన సమాచారం ప్రకారం.. నలుగురు అన్నదమ్ముల్లో పెద్దవాడు దశరథ్. ఆయనకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. అనుకోకుండా విచిత్రమైన మానసిక వ్యాధికి గురయ్యాడు. వ్యాధికి ముందు చెప్పులు దుకాణం చక్కగా నడుపుకుని బతికేవాడు. వ్యాధి వచ్చాక రాంచీ హాస్పిటల్లో వైద్యం అందించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. బాల్యదశలోని పిల్లలను వదిలిపెట్టి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దశరథ్‌ను ఎయిటిడి సిబ్బంది 2019 సెప్టెంబర్‌లో రెస్క్యూ చేసి ఐదేళ్లపాటు షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. పలుమార్లు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించారు. అంచెలంచెలుగా ఆయన కోలుకున్నారు. శ్రద్ధా సహకారంతో దశరథ్‌ను బీహార్ రాష్ట్రం, రోహితాస్ జిల్లాలోని దరిహత్ గ్రామంలో ఉంటున్న కొడుకు సంజయ్ కుమార్, కోడలు పూజిత దేవిలకు క్షేమంగా అప్పగించారు. పేషెంట్ రూపం మారినప్పటికీ అతని పేరుతో గ్రామస్తులు గుర్తుపట్టినట్లు వాసు తెలిపారు.

కుటుంబ సభ్యులతో దశరథ్ (సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ ఆత్మహత్య

కెజిహెచ్‌లో కలకలం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో విధులు నిర్వహిస్తున్న థియేటర్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్ ఆదివారం విధులు నిర్వహిస్తున్న ప్రదేశంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కెజిహెచ్‌లో కలకలం సృష్టించింది. ప్రేమ వ్యవహారంతో పాటు పలు కారణాలు ఆయన ఆత్మహత్యతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. విషయం తెలియడంతో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కెజిహెచ్ ఆర్ఎంఒ ఆయన వెంట ఉన్నారు. అప్పటికే మృతుని కుటుంబీకులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగిస్తామని అధికారులు తెలిపారు. అయితే సాయంత్రం అయినప్పటికీ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించలేదు. దీనికి కారణం పోలీసుల పంచనామా పూర్తి కాకపోవడమేనని తెలిపారు. వన్ టౌన్ పోలీసుల నిర్లక్ష్య వైఖరి అందుకు కారణమని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో విధుల్లో ఉండగా ఉద్యోగి మరణించినా, పోస్టుమార్టం విషయంలో ఆసుపత్రి అధికారులు సహకరించలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబీకులతో పాటు తోటి ఉద్యోగులు మార్చురీ వద్ద పడిగాపులు కాశారు.

ప్రశాంత్ కుమార్ మృతదేహం

'దమ్ము మీదే.. స్టార్ మీరే' టివిసి ప్రారంభం

విశాఖ కలెక్టరేట్ : ఐటిసి బ్రాండ్ తన ప్రాంతీయ ప్రచారంలో భాగంగా దమ్ముమీదే, స్టార్ మీరే అంటూ కొత్త వాణిజ్య ప్రకటన (టివిసి)ను విశాఖ నగరంలో ఆదివారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐటిసి స్పైసెస్ విభాగం కో-ఆర్డినేటర్ పియూష్ మిశ్రా మీడియాతో మాట్లాడుతూ ఐటిసి లిమిటెడ్ ఆశీర్వాద్ మసాలాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి తమ బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ నేచురల్ స్టార్ నానిని ఎంచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని నగరాలలో టివిసి ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా విశాఖ నగరంలో కూడా ప్రచార కార్యక్రమం జరిగిందన్నారు. ఆకర్షణీయమైన రుచులు, సుగంధ ద్రవ్యాలు సిగ్నేచర్ 'తెలుగు కారం'తో వృద్ధి చెందాయని, తమ విస్తృత శ్రేణి అధిక నాణ్యత, ప్రామాణికమైన మసాలాల ద్వారా ఈ పాకశాస్త్ర వారసత్వాన్ని ఆశీర్వాద్ మసాలా గౌరవిస్తుందని అన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE, AT VIZIANAGARAM
D.O.P No: 8/2024

Between :-
Korra Sunitha ...**Petitioner**
And
Korra.Ramesh ...**Respondent**

Respondent
Korra.Ramesh S/o.late David, Christian, aged 40 years, Car driver. r/at.D.No.6-310. Flat No.s/2, Gowtham Nagar, GVMC Vepagunta. Lakshmipuram, Vepagunta, Visakhapatnam-530047

Please take Notice that the above petition filed by the petitioner for grant of Divorce against you and the above matter coming for your appearance and stands posted to **16-04-2025 at 10:30 am** Therefore you are calling upon to appear before the Honourable Court on **16-04-2025 at 10:30 am** either in person or through an advocate, failing which the matter will be heard and decided in your absence and set ex-party by this Honourable Court.

(By Order of the Court)
Y.Rama Mohana Rao
R.Madhavi Krishna Veni, A.Suneetha
Advocates-Vskp
Cell No. 9291667603

అంబికాబాగ్‌లో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం దత్తత దేవాలయం, జగదాంబ జంక్షన్ సమీపంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం అంబికాబాగ్‌లో ఆదివారం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. అందులో భాగంగా ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు పంచామృతాభిషేకం, 10 గంటల నుంచి 12 గంటల వరకు శ్రీ సీతారామ కల్యాణం దేవస్థాన వేదపండితులు ఎం.భీమశంకరశాస్త్రి, సిహెచ్ఎల్ఎన్. అవధానులు, కె.పంచముఖి శర్మ, శ్రీ అంబికాబాగ్ దేవాలయ అర్చకులు పి.వి.బాల సుబ్రమణ్యాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

తదుపరి 5 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. పంచామృతాభిషేకం సేవలో 54 మంది, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవంలో 272 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు స్వామి వారి పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు ఉప కమిషనరు, కార్యనిర్వాహణాధికారిణి కె.శోభారాణి మీడియాకు తెలిపారు.

నేడు ఏజెన్సీలో మంత్రి సంధ్యారాణి పర్యటన

ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈనెల 7న తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు దుంబ్రిగూడ చేరుకుని ఉప ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు మహా సూర్యవందనం కార్యక్రమంలో పాల్గొని తిరిగి సాలూరు బయలుదేరి వెళ్తారు.

పార్కుల నిర్వహణేదీ?

కానరాని పచ్చదనం..
ఎక్కడికక్కడే చెత్త
ప్రచారానికే పరిమితం 'స్వచ్ఛాంధ్ర' నినాదం..

పొట్టి శ్రీరాములు పార్కులో తుప్పపట్టిన పరికరాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : అసలే ఎండలు మండిపోతున్నాయి. మరో వైపు యాంత్రిక జీవితంలో ఎవరి స్థాయిలో వారు ఊపిరి సలపని పని ఒత్తిడితో సతమతమవుతున్నవారు, ఆట విడుపుగా వచ్చి పార్కుల్లో సేద తీరే వారికి కాసింత ఆహ్లాదం, ఉపశమనం కరువైందనే చెప్పాలి. జివిఎంసి ఒకటో జోన్ మూడో వార్డు పరిధి బీచ్ రోడ్డులో ఉన్న గోకుల్ పార్కు, చిల్డ్రన్స్ పార్కు, మహాత్మా గాంధీ పార్కుల్లో మచ్చుకు కూడా పచ్చదనం, పరిశుభ్రత కానరాని పరిస్థితి ఉంది. పార్కుల ప్రాంగణం మట్టితో కూడి ఉంది. పచ్చ గడ్డి లేదు. మరో వైపు మొక్కల మధ్య, మహాత్మా గాంధీ, డాల్ఫిన్, మత్స్యకారుల బొమ్మల చుట్టూరా చెత్త కాగితాలు, ఖాళీ సీసాలు దర్శనమిస్తున్నాయి. పార్కుల్లో జివిఎంసి ఏర్పాటుచేసిన డస్ట్ బిన్లు చెత్తతో నిండి తుప్పుపట్టి ఉన్నాయి. పార్కులకు వచ్చే వారు భోజనాలు, అల్పాహారం తిని వదిలేసిన ఆకులు పడి ఉన్నాయి. ఇక పొట్టి శ్రీరాములు పార్కు ఎప్పుడూ తెరిచి ఉన్న సందర్భం లేదు. పార్కు గేటుకు తాళం వేసి ఉండడం సర్వ సాధారణం అని పార్కుకు వచ్చే వారు అంటున్నారు. ఈ పార్కులో పిల్లల కోసం అమర్చిన పలు పరికరాలు తుప్పు పట్టి ఉన్నాయి.

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' అంటూ ఊరూ వాడా తెగ ప్రచారం చేస్తున్న జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే బీచ్ రోడ్డులో ఉన్న పార్కుల్లో అపరిశుభ్రత కనిపించకపోవడంపై , పార్కులకు వచ్చే వారు పెదవి విరుస్తున్నారు. అందమైన సముద్రాన్ని చూసి మురిసిపోతున్నాం తప్పితే, పార్కుల్లో అపరిశుభ్రత చూసి అవాక్కవుతున్నట్లు పలువురు అంటున్నారు.

పర్యవేక్షణ గాలికి ?

పార్కుల పర్యవేక్షణను కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని పార్కుల పరిస్థితి చూసిన వారెవ్వరికైనా ఇట్టే అర్థమవుతుంది. షరా మామూలుగా వేసిన మొక్కలకు నీరు లేదు. అవి ఎండిపోయి ఆకులు రాలి పడి ఉన్నాయి. పోగులుగా పడి ఉన్న చెత్త సరేసరి.

ఇంటర్, టెన్త్ పరీక్షలు ముగిశాయి. సరదాగా బీచ్‌కు వచ్చే విద్యార్థులకు పక్కనే ఉన్న పార్కులను చూసి కాసేపు అక్కడ ఉండాలని ఎవరికైనా అనిపించక మానదు. పార్కుల నిర్వహణపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హాస్పిటల్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రం

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలో బిపివి కల్లాలు రోడ్డులో డాక్టర్ లక్ష్మణ్ రాయల్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఆదివారం చలివేంద్రం ఏర్పాటుచేశారు. మొదటి రోజు పానకాన్ని అందించారు. ప్రతిరోజూ చలివేంద్రాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాహనదారులకు, హాస్పిటల్‌కు వచ్చే వారికి దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం - డాక్టర్ రోహిణి పాటిల్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఆరోగ్యకరమైన జీవితం పోషకాహారంతోనే సాధ్యమవుతుందని పోషకాహార నిపుణులు డాక్టర్ రోహిణి పాటిల్ అన్నారు. ఏప్రిల్ 7 ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కాలిఫోర్నియా ఆల్మండ్స్ ఆధ్వర్యాన 'పోషకాహారం-ఆరోగ్యకర జీవితం' అంశంపై బీచ్ రోడ్‌లోని ఓ హోటల్‌లో సదస్సు నిర్వహించారు. సదస్సులో రోహిణి పాటిల్ మాట్లాడుతూ, సమతుల్య ఆహారం ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. బాదంపప్పు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను రోజువారీ భోజనంలో చేర్చడం ప్రభావవంత మైన మార్గం అన్నారు. కాలిఫోర్నియా బాదంపప్పులను ప్రోటీన్, డైటరీ ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, జింక్, విటమిన్ ఇ తదితర15 ముఖ్యమైన పోషకాల సహజ వనరుగా చెప్పవచ్చని పేర్కొన్నారు. శక్తి, రోగనిరోధక శక్తి, గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర స్థాయిలు, బరువు నిర్వహణకు బాదం ఉపయుక్తంగా ఉంటుందని వెల్లడించారు. ఈ సదస్సులో రితికాసమద్దర్, న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ ప్రతినిధి శీలా కృష్ణ స్వామి పాల్గొన్నారు.

వారంలో యథాతథ స్థితికి రోడ్డు

ప్రజాశక్తి కథనానికి స్పందించి వివరణ ఇచ్చిన ఎఇ

ప్రజాశక్తి -భీమునిపట్నం : వారం రోజుల వ్యవధిలో యథాతథ స్థితికి రోడ్డు పునర్నిర్మాణం చేయనున్నట్లు జివిఎంసి ఒకటో జోన్ అసిస్టెంట్ ఇంజినీర్ జి.సురేష్ ఆదివారం ప్రజాశక్తికి తెలిపారు. 'సిమెంట్ రోడ్డును తవ్వేశారు' శీర్షికన ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఆయన వెంటనే స్పందించారు. దాదాపు 40 ఏళ్ల క్రితం నాటి 200 ఎంఎం, ఎసి పురాతన పైపులైన్ స్థానంలో జివిఎంసి ప్రాజెక్ట్ నిధుల నుంచి విడతల వారీగా 200 ఎంఎం హెచ్‌డిపిఇ, అత్యంత నాణ్యతతో కూడిన పైపు లైన్‌ను వేస్తున్నట్లు వివరించారు. జివిఎంసి ఒకటో వార్డు కొండపేట పంప్ హౌస్ నుంచి జెడ్పీ హైస్కూల్, జ్యూట్ కార్మిక వాడ మీదుగా గణేష్ థియేటర్ వరకు తొలి విడతలో కిలోమీటర్ మేరకు కొత్త పైపులైన్ వేసేందుకు రోడ్డును తవ్వినట్లు తెలిపారు. పంప్ హౌస్ నుంచి చిల్లపేట, జీరుపేట, సుఖీభవ కాలనీ, చాకలిపేట వరకు తాగు నీరు సరఫరా చేసే పైప్‌లైన్ పూర్తిగా మరమ్మతులకు గురవ్వడంతో తాగు నీటి సరఫరాలో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ క్రమంలోనే కొత్త పైపు లైన్ వేస్తున్నట్లు వివరించారు.

కఠోర శ్రమ ద్వారానే లక్ష్య సాధన

'శశి' అవగాహన సదస్సులో వక్తలు

ప్రజాశక్తి -తగరపువలస : కఠోర శ్రమ ద్వారానే లక్ష్యాన్ని సాధించుకోవచ్చని శశి విద్యా సంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ స్పష్టం చేశారు. స్థానిక సంగివలస, శశి విద్యా సంస్థల క్యాంపస్‌లో ఆదివారం ఐఐటి, నీట్‌పై 6 నుంచి 10వ తరగతి,10+1లో చేరగోరు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శశి విద్యా సంస్థల ఛైర్మన్ వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, క్రమ శిక్షణతో పాటు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు నొక్కి చెప్పారు. పిల్లల పట్ల ప్రేమ చూపించవచ్చు గానీ అదే సమయంలో అతి గారాబం చేయరాదని తల్లిదండ్రులకు సూచించారు. పక్క వారి ఫలితాలతో పోల్చి విద్యార్థి నైతికతను తగ్గించరాదన్నారు. శశి విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ, ఐఐటి, నీట్‌లలో ర్యాంక్ సాధించేలా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ప్రణాళికా బద్ధంగా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఐఐటి, ఎఐ ఈఈఈ, ఎన్ఐటి, నీట్‌లలో తమ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతి ముగ్గురిలో ఒకరు సీటు సాధిస్తున్నారని తెలిపారు. పిల్లల చదువు పట్ల ఉపాధ్యాయులే గాకుండా వారి తల్లి దండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ వాడకానికి దూరంగా ఉండాలన్నారు. ఐఐటి, నీట్‌పై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలను ఈ సదస్సులో నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో శశి విద్యా సంస్థల డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ, విశాఖ క్యాంపస్ ఇన్‌ఛార్జి వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శశి విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ నరేంద్రకృష్ణ

నేరాలు ఘోరాలు

గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

గంజాయితో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కిలోల గంజాయితో ఐదుగురు వ్యక్తులను ఆదివారం పట్టుకుని అరెస్టు చేసినట్లు సిఐ నమ్మి గణేష్ తెలిపారు.వివరాలివి. గంజాయిని తెచ్చుకుని నిల్వ ఉంచుకుని తాగుతున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేయగా, ఐదుగురు వ్యక్తుల వద్ద రెండు కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితులు చింతగుంట పవన్, పప్పల సాయికుమార్, పోలవరపు వేణు, బెల్లంకొండ మహేంద్ర వర్మ, అప్పికొండ మణికంఠ భానుల నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయి అక్రమ వ్యవహారంలో మిగిలిన వ్యక్తులను గుర్తించి త్వరలో అరెస్టు చేస్తామని సిఐ తెలిపారు.

13 మొబైల్ ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో వార్డు పరిధి తగరపువలసలోని ప్రైవేట్ లేడీస్ హాస్టల్‌లో ఈ నెల 2వ తేదీ తెల్లవారు జామున చోరీకి గురైన 13 మొబైల్ ఫోన్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక నేర విభాగం ఎస్ఐ ఎస్.సూర్య ప్రకాశరావు తెలిపారు. లేడీస్ హాస్టల్‌లో మొబైల్ ఫోన్లు చోరీకి గురైనట్లు హాస్టల్ నిర్వాహకులు అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. చోరీకి పాల్పడిన నలుగురు నిందితులను మైనర్లుగా గుర్తించారు.

సినీ సంగీత విభావరిని ప్రారంభిస్తున్న సన్‌మూర్తి తదితరులు

అబ్బురపరచిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-విశాఖపట్నం : నగరానికి చెందిన ముగ్గురు గాయనీమణులు సివి.రాజేశ్వరి, కింతలి భాగ్యలక్ష్మి, షైలజ మిరాజ్ సంయుక్త నిర్వహణలో నారీ-భేరి బ్యానర్‌పై నిర్వహించిన సినీ సంగీత విభావరి అబ్బురపరచింది. శాస్త్రీయ సంగీతానికి ఊపిరి పోసిన వివిధ చిత్రాల గీతాలు ఆలపించి అలరించారు. కార్యక్రమాన్ని విశ్రాంత పోర్టు మెడికల్ ఆఫీసర్, సోషల్ మీడియా స్టేట్ ఛైర్మన్ సన్ మూర్తి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ఉషా చీరాల, కొణతాల రాజు తదితరులు ప్రారంభించారు. దాబాగార్డెన్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాయకులు పుండరీకుమార్, అమ్మాజీరావు, బంగారయ్య తదితరులు గాత్ర సహకారం అందించారు. కీబోర్డుపై సోమేష్, ప్యాడ్స్‌పై బాబ్జి, తబలాపై రమణమూర్తి వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో కళారంగ ప్రతినిధులు నాంచారయ్య, మేడ మస్తాన్ రెడ్డి పాల్గొన్నారు.

గెలాక్సీ ట్యాబ్ ఎస్10ఎఫ్ఇ విడుదల

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : సామ్‌సంగ్ నూతన ఉత్పత్తులైన గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ, గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ ప్లస్‌లను సామ్‌సంగ్ ఇండియా ఎంఎక్స్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ ఆదిత్య బబ్బర్ ఆదివారం విశాఖలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది ప్రీమియం టాబ్లెట్ డిజైన్‌లో లభిస్తుందని తెలిపారు. గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ సిరీస్‌లో ఇప్పటివరకు అతిపెద్ద స్క్రీన్, డిస్‌ప్లేను విస్తరించే స్లిమ్మర్ బెజెల్‌తో కూడిన గెలాక్సీ ట్యాబ్ ఎస్10ఎఫ్ఈ ప్లస్ సన్నని డిజైన్‌తో వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటాయని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతను గతంలో కంటే మరింత అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు.

గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు

ఓక్రిడ్జిలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి -తగరపువలస

స్థానికంగా ఉన్న ఓక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో గ్రేడ్ 12 సిబిఎస్ఇ ఇంటర్నేషనల్ బాకలౌరియల్ డిప్లొమా ప్రోగ్రాం (ఐబిడిపి) విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టోఫర్ షార్ట్ హాజరై మాట్లాడుతూ, భవిష్యత్తును విశాల దృక్కోణంతో స్వీకరించాలని, ప్రతి అవకాశాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. నిరంతర కృషి ద్వారానే విజయాలను సొంతం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి మాట్లాడుతూ, విద్యార్థుల అకడమిక్, వ్యక్తిగత విజయాలను ప్రస్తావిస్తూ ధర్మ బద్ధత, దయా గుణం ప్రాధాన్యాన్ని వివరించారు.

ప్రహరీ కూలడంతో బహిరంగమైన పాఠశాల ప్రాంగణం

ప్రహరీ లేక ఇక్కట్లు

రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా పాఠశాల

ప్రజాశక్తి -ఆనందపురం

ఆనందపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీ గత వర్షాకాలంలో నేలకొరిగింది. దాన్ని నేటికి నిర్మించకపోవడంతో రాత్రి వేళల్లో ఆకతాయిలు, మందు బాబులకు అడ్డాగా మారుతోంది. హైస్కూల్ గేట్లు మూసివేసినా ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళ యువకులు మందు పట్టుకొని క్రీడా మైదానానికి వెళ్లి తాగి సీసాలను అక్కడే వదిలేస్తున్నారు. ఈ సీసాలు పగిలిన సమయంలో విద్యార్థులు, వాకింగ్‌కు వచ్చే స్థానికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడం వల్లనే ఈ సమస్య ఎదురవుతోందని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిధిలమైన ప్రహరీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రారంభానికి సిద్ధం

ఎపిలో అతిపెద్ద మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్ట్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయింది. సిరిపురం జంక్షన్‌లో విఎంఆర్‌డిఎకు అభిముఖంగా రూ.87.5 కోట్లతో దీనిని నిర్మించారు. దీనికి 18 శాతం జిఎస్‌టి అదనం. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఈ ప్రాజెక్టును విఎంఆర్‌డిఎ ఎంతో ప్రతిష్టాకరంగా చేపట్టింది. 1.90 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో, ఎకరా 72 సెంట్లు స్థలంలో నిర్మించిన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌లో 430 కార్లు, 400 ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. కేవలం కార్ పార్కింగ్ మాత్రమే కాకుండా, అతిపెద్ద కమర్షియల్ ఫేస్ లక్షా 60 వేల చదరపు అడుగులలో ఏర్పాటు చేశారు. సూపర్ మార్కెట్లు, కార్పొరేట్ కంపెనీలు వంటి వాణిజ్య సంస్థలు ఇక్కడ ఏర్పాటుచేసే విధంగా నిర్మాణం జరిగింది. 2021 డిసెంబర్‌లో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 2022 జనవరి నెలలో పనులు ప్రారంభించారు. ఒప్పందం ప్రకారం 18 నెలల్లో దీని నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. అయితే అనేక కారణాలవల్ల నిర్మాణంలో జాప్యం జరిగింది.

క్రూయిజ్ ఆకారంలో నిర్మాణం

విశాఖపట్నానికి ల్యాండ్ మార్క్‌గా సముద్ర తీరం నిలుస్తుంది. సముద్రం అనగానే అందులో నౌకలు గుర్తుకొస్తాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని 10 అంతస్తులతో నిర్మించిన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ నిర్మాణాన్ని 'నౌక' ఆకారంలో నిర్మించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం విశాఖపట్నాన్ని సాఫ్ట్ వేర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటిస్తున్న నేపథ్యంలో, అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఇదే భవనంలో ఏర్పాటు చేయడం కోసం, కొన్ని అంతస్తులను ప్రత్యేకంగా విడిచిపెట్టినట్లుగా విఎంఆర్‌డిఎ అధికారులు తెలిపారు. త్వరలోనే ఈ భవనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నట్లు తెలిసింది. అనుకున్న విధంగా ఈ భవనం ప్రారంభించబడి, ప్రతిపాదించిన అన్ని ప్రాజెక్టులు ఇందులో ఏర్పాటైతే సిరిపురం జంక్షన్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని చెప్పక తప్పదు. సిరిపురం జంక్షన్ కాస్త 'సిరులు' కురిపించే జంక్షన్‌గా రూపాంతరం చెందుతుందని స్థానికులు భావిస్తున్నారు.

విఎంఆర్‌డిఎ ఎదురుగా నిర్మితమైన మల్టీలెవెల్ కారు పార్కింగ్ భవనం

వంటిల్లు జంక్షన్‌కు మహర్దశ!

రూ.కోటి వ్యయంతో అభివృద్ధి

వంటిల్లు జంక్షన్

ప్రజాశక్తి -గాజువాక : నిత్యం రద్దీగా ఉండే వంటిల్లు జంక్షన్‌కు మహర్దశ పట్టేలా కనిపిస్తోంది. ట్రాఫిక్‌ను నియంత్రించాలనే ఉద్దేశంతో దీని రూపురేఖలు మారనున్నాయి. రూ.కోటి వ్యయంతో రింగ్ రోడ్డుతో పాటు ఉన్న రోడ్లను వెడల్పు చేయనున్నారు. పెదగంట్యాడ నుంచి గాజువాక, కణితిరోడ్డు, పాత గాజువాక నుంచి పెదగంట్యాడ, చిన్న గంట్యాడ నుంచి కణితి మార్కెట్‌కు నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వంటిల్లు జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఒక్కొక్కసారి గంటల సమయం వేచి ఉండాల్సి వస్తోంది. పండగ సమయాల్లో ఈ జంక్షన్ వైపు రావడానికి ప్రజలు సాహసం చేయలేదు. వేరే మార్గాల గుండా ప్రయాణిస్తుంటారు. పాత గాజువాక తరహాలో ఇక్కడ రింగ్ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. ఎక్కడ వాహనాలు నిలుపుదల లేకుండా ఎవరి మార్గంలో వారు ప్రయాణించేలా డిజైన్ చేపట్టారు. ఇప్పటికే దీనికి సంబంధించిన కాలువపనులు జరుగుతున్నాయి. అవి పూర్తయిన వెంటనే రింగ్ రోడ్డు పనులు ప్రారంభిస్తారు. దీనికి సంబంధించిన టెండర్ పూర్తయి శంకుస్థాపన కూడా చేశారు. గాజువాకలో జనాభా పెరగడంతో ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రంగా ఉంది. ఇది పూర్తయితే గాజువాక ప్రజలకు ఎంత ఉపయోగకరమని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పవన్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పెందుర్తి : పవన్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సుజాతనగర్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరు జిల్లాలో తల్లిబాట కార్యక్రమాన్ని నిర్వహించడానికి సోమవారం విచ్చేస్తున్న పవన్‌కల్యాణ్ వేపగుంట కూడలిలో కొంత సమయం ఆగుతారని, అందరూ హాజరుకావాలని కోరారు.

రాయగడ - సింగారం సెక్షన్‌లో జిఎం పరిశీలన

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ రాయగడ-కీత్‌గూడ-సింగారం సెక్షన్‌ను ఆదివారం పరిశీలించారు. లైన్ డబ్లింగ్, స్టేషన్ డెవలప్‌మెంట్, రన్నింగ్ రూమ్, ట్రాక్‌లు, సొరంగాలు, వంతెనలను పరిశీలించారు. అనంతరం మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, వాటి విశ్వసనీయత, భద్రతను పెంచడంపై అధికారులకు పలు సూచనలు చేశారు. రాయగడ డివిజనల్ సైట్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పురోగతిని జిఎం పరిశీలించారు. సింగారంలో గూడ్స్ సైడింగ్ పనుల పురోగతిని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలో ఆయన వెంట రాయగడ డిఆర్ఎం, చీఫ్ ఇంజినీర్, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు.

మహా సూర్యవందనానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా నుండి ప్రపంచ రికార్డ్ దిశగా 108 సూర్య నమస్కారాలు కార్యక్రమాన్ని 20 వేల మంది విద్యార్థులతో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న విషయం విదితమే.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదివారం ఆ ప్రాంగణాన్ని పరిశీలించారు.

హెల్త్ సిటీలో మెడ్‌సీ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలో మెడ్‌సీ ఆసుపత్రిని ఆదివారం ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.శిరీషారాణి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ శిరీషారాణి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా మహిళలకు ప్రత్యేక విభాగాలు, చెక్ కేరింగ్ ద్వారా పిల్లలకు మల్టీ స్పెషాలిటీ, ఐవిఎఫ్ విభాగాగానికి సంబంధించిన టెక్నాలజీ తదితరాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మెడ్‌సీ ఆసుపత్రి హైదరాబాద్, విజయవాడ, విజయనగరం, శ్రీకాకుళం, తెలంగాణ తదితర ప్రాంతాల్లో ఉందని, ఎనిమిదో బ్రాంచ్‌గా విశాఖలోని ఆరిలోవ హెల్త్‌సిటీలో ప్రారంభించామని చెప్పారు. ప్రత్యేకమైన వైద్య నిపుణులతో జనరల్, పారియాటిక్స్, జనరల్ పిడియాట్రిక్స్, మనోరోగచికిత్స, అనస్థీషియాలజీ, పల్మోనాలజీ, కార్డియాలజీ, కాయారాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నియోనాటాలజీ, హెమటో - ఆంకాలజీ, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్స్, రుమటాలజీ తదితర ప్రత్యేకమైన చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్, బొత్స అనూష, మెడ్‌సీ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్, డాక్టర్ పద్మజ, నవనీత్, వైఎస్ఎన్.రావు, డాక్టర్ పద్మజ, డాక్టర్ పద్మావతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, బొత్స ఝాన్సీ, ఎమ్‌డి డాక్టర్ శిరీషా రాణి

ప్రజాశక్తి 5
సోమవారం 7 ఏప్రిల్ 2025

నగదు పరిహారం చెల్లించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు
- అనకాపల్లి, అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులతో సమావేశం, నిరసన

నిర్వాసితులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-మునగపాక: అనకాపల్లి, అచ్యుతాపురం రహదారి విస్తరణలో భూములు, ఇల్లు, ఇతర ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితులకు నగదు రూపంలోనే పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. టిడిఆర్ బాండ్లు ఇచ్చే ప్రయత్నం మానుకోవాలని కోరారు. ఆదివారం స్థానిక రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో అనకాపల్లి- అచ్యుతాపురం రహదారి విస్తరణ నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు పరిహారంగా టిడిఆర్ బాండ్లు ఇస్తామని హడావిడి చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు బాధితులకు నష్టపరిహారం ఎంత అందజేస్తారనే విషయం నేటికీ స్పష్టత లేదన్నారు. ఏ గ్రామంలో ఎవరి భూమి, స్థలం, ఇల్లు ఎంతవరకు పోతుందనే జాబితాను తయారు చేయలేదన్నారు. ప్రైవేటు భూమి, డి పట్టా, గ్రామకంఠంలోని స్థలాలు, ఆ స్థలాల్లోని ఇళ్లకు విలువ ఎలా పడుతున్నారో తెలియకుండానే అధికారులు హడావిడి చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన భాగం వరకు పరిహారం చెల్లిస్తారా? వినియోగించు కోవడానికి వీల్లేని మిగిలిన భాగానికే కూడా పరిహారం చెల్లిస్తారా? అనే విషయం తెలియక నిర్వాసితులు అయోమయంలో ఉన్నారన్నారు. టిడిఆర్ విధానం నిర్మాణదారులకు తప్ప గ్రామీణ ప్రాంతంలోని సాధారణ ప్రజలకు ప్రయోజనం ఉండదని, వీటిని అమ్ముకునేందుకు బాధితులు భవిష్యత్తులో అనేక అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. బాధితుల సమస్యలను పక్కనపెట్టి పరిశ్రమల వాహన రాకపోకలకు చేపట్టే రోడ్డు విస్తరణలో పేద ప్రజలను బలి చేయడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి నిర్వాసితులకు నేరుగా నగదును అందజేయాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇల్లు షాపులు కోల్పోతున్న వారికి స్థలాలు ఇచ్చి పునరావాసం కల్పించాలన్నారు. ఆర్అండ్‌బి రోడ్డులో చిరు వ్యాపారం చేసుకుంటున్న వారిని ఆదుకోవాలనీ, స్ట్రక్చర్ వ్యాల్యూకు ప్రస్తుత నిర్మాణ ధరలకు రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం, నిర్వాసిత సంఘ నాయకులు కర్రి అప్పారావు, కె.సదాశివరావు, రొంగలి రాము, ఎస్ బ్రహ్మాజీ, బొడ్డేడ రామ్‌కుమార్, కాండ్రేగుల రామ అప్పారావు, టెక్కలి జగ్గారావు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకు భూసేకరణ చేపట్టాలి

రాంబిల్లి :రహదారి విస్తరణలో భూసేకరణ నిర్వాసితుల ఇష్టంతో, వారి సమ్మతితోనే చేపట్టేలా తప్ప, భయాందోళనకు గురిచేస్తే దౌర్జన్యంగా లాక్కోవాలని చూడడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని గోరపూడి, జడ్డితువా పంచాయతీ గ్రామాలలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, నాయకులు ఆర్ రాము, మండల కార్యదర్శి జి దేముడు నాయుడులతో కూడిన బృందం పర్యటించి, ప్రజలు, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సెజ్ ఎన్‌డిపి, జెడ్‌ఎం, తహశీల్దార్, ఇతర అధికారులు వచ్చి, రహదారి విస్తరణకు భూసేకరణ పేరుతో నిర్వాసితులతో సమావేశాలు పెట్టి, వారి నుంచి బలవంతంగా తీసుకోవాలని చూస్తున్నట్లు స్థానికులు సిపిఎం బృందం దృష్టికి స్థానికులు తెచ్చారు. ప్రజలకు ఇష్టం లేకున్నా భూసేకరణ తప్పదని, పరిహారాన్ని తీసుకోకుంటే కోర్టు ద్వారా చెల్లిస్తామని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. చింతువా రెవెన్యూ పరిధిలోని కొండవారిపాలెం, దుర్గాలమ్మ గుడి దగ్గర నుండి, పూడిమడక రోడ్డుకు వంద అడుగులు రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇళ్ళు, భూములు, ఇతర ఆస్తులకు సంబంధించి ఆధారాలు తెచ్చుకోవాలని అడుగుతు న్నారని కొండవారిపాలెం, గజరెడ్డిపాలెం, లోవపాలెం గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రజలకు నోటీసులు ఇవ్వకుండా, ఎటువంటి సమాచారం లేకుండా భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గ మన్నారు. తాము భూములు, ఇళ్ల ఇతర ఆస్తులను ఇవ్వలేమని తెగేసి చెప్పినా, అధికారులు దౌర్జన్యంగా తీసుకోవాలని చూస్తున్నారని సిపిఎం బృందం వద్ద బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తే, అంతకుమించి దౌర్జన్యం కనిపిస్తోందని నిర్వాసితులు వాపోయారు.దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజలకు ఇష్టం లేకుండా భూసేకరణ సరికాదని, అధికారులు, నేతలెవరైనా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే బాధితులను సమీకరించి, పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నృత్య ప్రదర్శనలో కళాకారులు

ప్రజాశక్తి- అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక కొత్త అమావాస్య జాతర, రాష్ట్ర పండగలో భాగంగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టు కుంటున్నాయి. ఇందులో భాగంగా శనివారం 750 మంది మహిళలచే సామూహిక లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం కోలాటాలు, భరతనాట్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కడురమ్యంగా జరిగాయి. కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గం లో ఉన్న మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనకాపల్లి చరిత్రలో ఇటువంటి కార్యక్రమాలు ఎన్నడూ జరగలేదని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనసేన ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ, కూటమి నాయకులకు భక్తులు, ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలి

అపార్టుమెంట్ వాసులకు నోటీసులిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : ప్రజల భద్రత, నేరాల నియంత్రణకు అపార్టుమెంట్లలో సిసి కెమెరాల ఏర్పాటు అవసరమనిఅనకాపల్లి టౌన్ సిఐ విజయ్ కుమార్ అన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు ఆదివారం టౌన్ సిఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వ్యాపార సముదాయాలు, అపార్ట్‌మెంట్ల యజమానులకు సిసి కెమెరాల ఏర్పాటు వల్ల ప్రయోజనాలను వివరిస్తూ, వాటిని ఏర్పాటు చేసుకోవాలంటూ నోటీసులు ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 2013 సెక్షన్ 3(1) ప్రకారం సిసి కెమెరాలు పెట్టుకోవాలని సూచించారు. నేరాలను అరికట్టే క్రమంలో తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి నిధులతో బోరు ఏర్పాటు

మంచినీటి మోటార్‌ను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని అయితంపూడిలో నూతనంగా నిర్మించనున్న మరిడిమాంబ ఆలయం వద్ద ,స్థానిక నాయకుల వినతి మేరకు జెడ్‌పిటిసి దొండా రాంబాబు తన కోటా నిధులతో సమకూర్చిన తాగునీటి బోరు, మోటారును సమకూర్చారు. ఆదివారం స్థానిక నాయకులతో కలిసి బోరు, మోటారును జెడ్‌పిటిసి రాంబాబు ప్రారంభించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు చేపడతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దాడ నాయుడు, ఎంపిటిసి గొంపా చినబాబు, పాల్గొన్నారు. .ఈ సందర్భంగా జెడ్‌పిటిసి స్థానిక సర్పంచ్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి రాంబాబు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మరిడిమాంబ నూతన ఆలయ నిర్మాణానికి వైసిపి గ్రామ నాయకులు ముచ్చకర్ల వెంకటరావు, లావణ్య దంపతులు రూ.లక్ష ఆర్థికసాయాన్ని జెడ్‌పిటిసి రాంబాబు ద్వారా గ్రామ సర్పంచ్ పెద్దాడ నాయుడు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దిబ్బిడి, కెపి. అగ్రహారం సర్పంచ్లు పెదిరెడ్ల మాణిక్యం (భాషా), గోపిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

సాయం అందజేస్తున్న శిష్టకరణం ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- సబ్బవరం: గొంతు కేన్సర్‌తో బాధపడుతున్న జివిఎంసి 75వ వార్డు అగనంపూడి శివారు దానబోయినపాలెం గ్రామానికి చెందిన జగ్గుమంత్రి శ్రీనివాసరావుకు శిష్టకరణ ఫౌండేషన్ అధ్యక్షులు మానాపురం సురేష్‌కుమార్, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు శేఖరమంత్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శిష్ట కరణం కుటుంబసభ్యుల ద్వారా సేకరించిన రూ.50వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అంద జేశారు. కేన్సర్‌తో బాధపడుతూ అగనంపూడి హోమీబాబా ఆసుపత్రిలో ఆపరేషన్ అనంతరం శ్రీనివాసరావు అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో ఇటు వైద్యానికి, అటు కుటుంబపోషణకు శ్రీనివాసరావు పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని తక్షణమే స్పందించి నాలుగు రోజుల్లో ఈ మేరకు డబ్బులు సమకూర్చి, దానబోయినపాలెం గ్రామంలోని బాధితుడు శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి అందజేశారు .భవిష్యత్తులో కూడా ఏమైనా ఆర్థిక సహాయం అవసరమైతే ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచిన శిష్టకరణం ఫౌండేషన్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టీం హైదరాబాద్ ప్రతినిధి డి.నరేష్, పట్నాయక్ ఫౌండేషన్ సభ్యులు బి. శ్రీనివాస్ పట్నాయక్, ఎంఎస్ఎస్ పట్నాయక్, ఎం.రవి కాంత్ పట్నాయక్, ఎ.విశ్వేశ్వరరావు పట్నాయక్ పాల్గొన్నారు.

గంజాయి కేసులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : గంజాయి కేసులకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అచ్యుతాపురం సిఐ నమ్మి గణేష్ హితవు పలికారు. అనకాపల్లి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, క్రయవిక్రయాలు, గంజాయి తాగడం వంటివాటిపై పటిష్టనిఘా కొనసాగుతోందన్నారు. గంజాయితో పట్టుబడిన కేసుల్లో నిందితులకు జైలుశిక్షతోపాటు జరిమానాలు భారీ స్థాయిలోనే ఉంటాయని, యువత జాగ్రత్త పడాలని సూచించారు. గంజాయి రవాణా, అమ్మడం, కొనుగోలు చేయడం, తాగడం, ఏరూపంలో గంజాయితో సంబంధమున్నా నేరస్తులుగా పరిగణించబడతారన్నారు. గంజాయి నియంత్రణకు ...ం.ం.వ టిలా ...కాకుండా డ్రోన్ల సహాయంతో నిఘా కొనసాగుతోందని, ఏ రూపంలో గంజాయిని కలిగి ఉన్నా పట్టుబడడం ఖాయమని హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, యువత తమ భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని సూచించారు.

ఘనంగా వాసవి స్కూల్ వార్షికోత్సవం

వార్షికోత్సవంలో సాంప్రదాయ వేషధారణలో చిన్నారులు

ప్రజాశక్తి -చోడవరం :స్థానిక నూకాలమ్మ ఆలయ సమీపంలోని వాసవి స్కూల్ 20వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఆ సందర్భంగా జిల్లా పరీక్షల విభాగం (డిసిబి) రైటర్, ఉపాధ్యాయుడు కె.భాస్కరరావు మాట్లాడుతూ, ఒక స్కూల్ స్థాపించి, దాన్ని 20 ఏళ్లపాటు నిర్వహించడం సాధారణ విషయం కాదన్నారు. క్రమశిక్షణతో నడిపితేనే ఇది సాధ్యమన్నారు. అనంతరం భాస్కరరావుతో పాటు ఉపాధ్యాయులు ఎంవి.నాయుడు, రామ్ కుమార్‌లను వాసవి స్కూల్ కరస్పాండెంట్ చామంతుల సాంబమూర్తి, ప్రిన్సిపల్ మల్లీశ్వరి సన్మానించారు. వార్షికోత్సవం సందర్భంగా స్కూల్ విద్యార్థుల ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

'జాగృతి' ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

మజ్జిగ పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -సబ్బవరం. : జాగృతి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సబ్బవరం రామాలయం ఆవరణలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత ఆధ్వర్యంలో ఏటా ఆనావాయితీగా ఏర్పాటు చేస్తున్న మజ్జిగ పంపిణీని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాముల దర్శనానికి, కల్యాణోత్సవానికి వచ్చిన రెండు వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత, ఆలయ కమిటీ సభ్యులు దంగేటి ప్రకాష్, బర్ల రమణ, కోరాడ శ్రీనివాస్, గెద్దం కృష్ణ, గెద్దం రామేష్, కోన సోమేశ్వర్, సిఐఒ కుమారి కె.ఎల్ఎస్ మౌక్తిక , సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఈదురు గాలులకు అరటి తోటలు నేల మట్టమవ్వడంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకొని నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని చీడిక కొత్తూరు గ్రామంలో శనివారం సాయంత్రం అకస్మాత్తుగా ఈదురు గాలులు వీయడంతో అరటి చెట్లు విరిగిపోయి, నేలమట్టమయ్యాయి. ఆదివారం ఉదయం సంబంధిత రైతులతో కలిసి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, చీడిక కొత్తూరు గ్రామానికి చెందిన కౌలు రైతు వీసం నర్సింగరావు చెందిన 5 ఎకరాలు, నగిరెడ్డి వెంకటేష్ కు చెందిన ఎకరం, గోళ్ళ నరేంద్ర కు చెందిన ఎకరం, కర్రి తమ్మారావుకు చెందిన 89 సెంట్లు, కర్రి నాగేశ్వరరావు కు చెందిన 2 ఎకరాలు, వెదుళ్ళ రాజు కు చెందిన రెండు ఎకరాలు, కౌలు రైతు వీసం సత్యనారాయణ కు చెందిన 2 ఎకరాల అరటి తోటలు ఈదురు గాలులకు నేలమట్టమై రైతులకు అపార నష్టం జరిగిందన్నారు. వారం, రెండు వారాల్లో అరటి గెలలు కోత దశకు వస్తాయని, ఇటువంటి సమయంలో అకస్మాత్తుగా వీచిన ఈదురు గాలులకు తోటలు దెబ్బతిని రైతులకు అపార నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా ఎకరానికి లక్ష రూపాయల వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. స్థానిక హార్టికల్చర్ అధికారి, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న తోటలను పరిశీలించి, ఎకరానికి లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కన్నారావు, వి.నరసింగరావు, వి.శ్రీను, వి.రాజేష్, ఎస్.వెంకటేష్, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నష్టపోయిన అరటి తోటలను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకెండియర్ తరగతులు ఈనెల ఒకటి నుంచి ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ వైవిఎల్ అన్నపూర్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్స్ కూడా జరుగుతున్నాయన్నారు. కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపుల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియంలలో బోధన జరుగుతుందన్నారు. ఈ ఏడాది నుంచి ఎన్సిఇఆర్టి పద్ధతిలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు నూతన సిలబస్‌లో ఎంపిసి గ్రూపులో బయాలజీ, బైపిసి గ్రూపులో గణితం సబ్జెక్టును అదనంగా తీసుకోవచ్చన్నారు. ఇంటర్ తరువాత ఐఐటి, మెయిన్స్, అడ్వాన్స్, నీట్ పరీక్షలకు కూడా విద్యార్థులను సన్నద్ధం చేసేలా కాలేజీలో బోధన ఉంటుందన్నారు. కాలేజీలో అందుబాటులో ఉన్న నాలుగు గ్రూపుల్లో విద్యార్థులు తమకు కి నచ్చిన గ్రూప్ తీసుకోవచ్చన్నారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, క్రమశిక్షణ కలిగిన విద్య బోధన, డిజిటల్ విద్యాబోధన, .ప్రభుత్వం తరపున ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్స్ పుస్తకాలు, కాలేజీ బ్యాగ్, మధ్యాహ్నం భోజన పథకం, ఇతర సదుపాయాలు ఉంటాయన్నారు కాలేజీలో విద్యార్థులకు అధునాతన మరుగుదొడ్లు, రక్షితనీటికి ఆర్వోప్లాంట్, విశాలమైన వసతి, ఇతర సౌకర్యాలు, క్రీడా మైదానం అన్ని సౌకర్యాలున్నాయన్నారు. వీటికి తోడుగా మంచి ఉత్తీర్ణత శాతం సాధిస్తున్నామన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశం ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ అన్నపూర్ణ సూచించారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి : ఐద్వా నేత వరలక్ష్మి

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఐద్వా నేత వరలక్ష్మి

ప్రజాశక్తి -కశింకోట : బాలికను దారుణంగా హతమార్చిన ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం మండలం నర్సింగబిల్లి జంగాల కాలనీకి వెళ్లి బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థిని పిల్లబోయిన బ్యులాను వారి ఇంటి పక్కనే అద్దెకుంటున్న వ్యక్తి ప్రేమించలేదని కక్షతో, అతి కిరాతకంగా గొంతు నులిమి చంపి ఫ్యాన్‌కు ఉరేశాడని, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి డి వరలక్ష్మి ఆవేదన వెలిబుచ్చారు. నిందితుడికి నిర్భయ చట్టం ప్రకారం శిక్ష పడాలని, ఫాస్ట్ ట్రాక్‌కోర్టు ద్వారా దర్యాప్తు, విచారణ వేగవంతం చేసి, నిందితుడికి శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని, ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా ఉండేలా శిక్ష అంత భయంకరంగా ఉండాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు రాష్ట్ర హోంశాఖమంత్రి సొంత జిల్లాలోనే ఇలాంటి వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. దీనిపై హోంమంత్రి అనిత స్పందించి ఇలాంటిఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మహిళా, నేర చట్టాలను కఠినంగా అమలు చేయడంలో ప్రభుత్వాల వైఫల్యమే వరుస నేరాలకు కారణమని, ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఐద్వా తరపున డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ఫోటో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి అనకాపల్లి టౌన్/ రూరల్ : సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పట్టణ సిఐ విజయ్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ అన్నారు. ఆదివారం అనకాపల్లి పట్టణంలోని పలు కూడళ్లలో సైబర్ నేరాలు, డ్రగ్స్, మహిళలపై నేరాలు, శక్తి యాప్ పట్ల అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తమై ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేరాలపై అవగాహన కల్పించే చర్యలను తీసుకుంటున్నట్లు ఎస్ ఐ ఈశ్వరరావు తెలిపారు.

నేడే చోడమాంబిక పుట్టుక జాతర

ప్రజాశక్తి -అచ్యుతాపురం : జిల్లాలో ప్రసిద్ధి చెందిన చోడమాంబిక అమ్మవారి పుట్టుక జాతర సోమవారం చేయటానికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. పుట్టుక జాతర సందర్భంగా పంచాయతీ పరిధిలో భారీ విద్యుత్ దీపాలంకరణ చేశారు. సోమవారం రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఒడిసెల నాయుడు, కమిటీ సభ్యులు జాతరను ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నేడు అనంతగిరి వారపుసంత రద్దు

ప్రజాశక్తి -అనంతగిరి: మండల కేంద్రంలో ఈనెల 7న జరగాల్సిన వారపు సంత తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు తహసీల్దార్ మాణిక్యం, ఎంపీడీవో ఏ వివి. కుమార్ తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అనంతగిరి మీదుగా డుంబ్రిగూడ మండలంలో పర్యటన ఉన్నందున వారపు సంతను రద్దు చేశామని, వ్యాపారులు, కొనుగోలుదారులు గమనించాలని వారు కోరారు.

ఏజెన్సీలో ఈదురుగాలులతో వర్ష బీభత్సం

ప్రజాశక్తి -రాజవొమ్మంగి :మండలంలోని లోదొడ్డి, వాతంగి తదితర గ్రామాల్లో :ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులు పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. పగలంతా మండిపోయేలా ఎండలు కాచినా, సాయంత్రానికి ఒక్కసారిగా ఆకాశంలో కారుమబ్బులకు కమ్ముకొని భారీ ఈదురుగాలులతో కూడిన వర్ష బీభత్సం సృష్టించింది. తోటల్లోని మామిడి, జీడి మామిడి కాయలు నేలరాలిపోవడంతో భారీ నష్టమే జరిగింది. బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

పాడేరు టౌన్: మన్యంలో ఆదివారం ఉదయం పొగమంచు, మధ్యాహ్నం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో వాతావరణం చల్లబడింది. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని ఏజెన్సీలోని ఆయా ప్రాంతంల్లోనూ ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పాడేరులో తెల్లవారు జాము నుంచి ఉదయం 8 గంటల వరకు పొగమంచు కురిసింది. తర్వాత నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆకాశం మేఘావృతమై ఎండ పెద్దగా కాయలేదు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత గంట సేపు వర్షం కురిసింది. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారింది

పాడేరులో కురుస్తున్న భారీ వర్షం

8న నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - యలమంచిలి : నియోజక వర్గంలోని నాలుగు మండలాల యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఈనెల 8న మంగళవారం నుంచి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కొండలరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, వారికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్న లక్ష్యంతో కార్యక్రమం రూపొందించారన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు క్యూఆర్ కోడ్ ద్వారా వారి వివరాలు నమోదు చేసుకోవాలని, ఎపి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన సంస్థ అధికారులు నిర్వహించే ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి శిక్షణ అనంతరం అర్హులకు ఉద్యోగావకాశాలను కల్పిస్తారన్నారు. ఐటి, ఆటోమేటివ్, లాజిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, హార్డ్ వేర్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, క్యాపిటల్ గూడ్స్ రంగాల్లో శిక్షణ ఇచ్చిన తర్వాత నెలకు రూ. 12వేలు నుంచి రూ. 18వేలు జీతంతో ఉద్యోగవకాశాలను కల్పిస్తారన్నారు. నియోజకవర్గంలోని మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి మండలాల్లోని నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 8న మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

నర్సీపట్నంలో పూజలు చేస్తున్న స్పీకర్ అయ్యన్న దంపతులు

ప్రజాశక్తి- కొమ్మాది : జివిఎంసి 5వ వార్డు పరిధి బొట్టవానిపాలెంలోని శ్రీకోదండరామ ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్పొరేటర్ మొల్లి హేమలత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన చేశారు.

సీతమ్మధార : సీతమ్మధార క్షత్రియ కళ్యాణ మండపంలో క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యాన సిరి వేంకటేశ్వర డవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కెకె.రాజు దంపతులు, యువిఎస్.శివకుమార్ దంపతులు సీతారాముల కల్యాణం జరిపించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో డి.తిరుపతిరాజు, ఆర్‌వి.గణపతిరాజు పాల్గొన్నారు.

మర్రిపాలెం ప్రధాన రహదారిలోని గౌరీ కల్యాణ మండపంలో శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యాన మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటుచేసి పంపిణీ చేశారు.

పద్మనాభం: మండలంలోని అయినాడలో సర్పంచ్ మామిడి శివ దంపతులు, వికె.పాలెం, మద్ది, అనంతవరం, రెడ్డిపల్లి, కృష్ణాపురం, బిఆర్.తాళ్లవలసలో సీతారాముల కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. కోరాడలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు కార్యక్రమాల్లో ఎంపిపి రాంబాబు. కె.రామస్వామినాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి నరవ రామాలయం వద్ద సీతారామ కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్న దానం చేశారు. ఈ కార్యక్రమంలో జి.శివ, గల్లా శ్రీనివాసరావు ఇల్లాపు శ్రీను పాల్గొన్నారు. వేపగుంట రామాలయం, ఆర్‌ఆర్.వెంకటాపురం, చినముసిడివాడ, పెందుర్తిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు

తగరపువలస : తగరపువలస జంక్షన్, చిట్టివలస, జీరుపేట, తాళ్లవలస గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. సంబంధిత ఆలయ కమిటీల ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు.

ఆనందపురం : గుడిలోవ విజ్ఞాన విహార్లఓ శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఎయు విశ్రాంత ఆచార్యులు అక్కుభట్ల శర్మ శ్రీరామనవమి ప్రవచనాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.చంద్రశేఖరరావు, సంతోష్ కుమార్ దంపతులు పాల్గొన్నారు.

ఆనందపురంలో పంచాయతీ దొంతలవారి కల్లాలలో ఆంజనేయస్వామి గుడిలో శ్రీరామనవమి వేడుకలు జరిపారు. సాయంత్రం కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దొంతల శ్రీను, శంకరరావు, వెంకట నారాయణరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. జివిఎంసి అడిషనల్ కమిషనర్ రేలంగి సోమన్నారాయణ దంపతులు, విశ్రాంత ఎయూ జాయింట్ రిజిస్టర్ గవర రాజు దంపతులు కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయం కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు, బుడ్డిగ సత్యనారాయణమూర్తి నగేష్ శర్మ ప్రభాస్ పాల్గొన్నారు.

అనకాపల్లి : పట్టణంలోని చిన్న బజార్ రామాలయంలో స్వామికి జనసేన నియోజక ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. తుమ్మపాల పంచాయతీ గవరపేట వీధి, పిసినికాడ, సీతానగరం, కసింకోట కస్పావీధి, అనకాపల్లి పట్టణం నర్సింగరావుపేట, పూడిమడక రోడ్డులో సీతారాముల ఆలయాల్లో రాములోరి కల్యాణంలో రాంకీ పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : అనకాపల్లిలో పలు రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, బత్తుల తాతయ్య బాబు , గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర ఉన్నారు. పెద రామస్వామి దేవాలయంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌తో కలిసి దర్శించుకున్నారు.

కశింకోట : చింతలపాలెంలో శ్రీరామనవమి వేడుకల్లో జనసేన మండల అధ్యక్షులు బుదిరెడ్డి చిన్నా, ఉలింగాల రమేష్, కర్రి దుర్గ నాయడు, జెర్రిపోతుల నూకినాయడు, జ్యోతి కుమార్, అచ్చర్లలో టిడిపి గ్రామ అధ్యక్షులు నైనంశెట్టి రమణ రావు, నిమ్మదల సన్యాసినాయడు, దొడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు. తాళ్ళపాలెం, బంగారయ్యపేటలో భారీ అన్నసమారాధన జరిగింది

కె.కోటపాడు : చౌడువాడ, మేడిచర్ల, కె.కోటపాడు రామాలయాల్లో రామనవమి వేడుకల్లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సబ్బవరం: ఆరిపాక పంచాయితీ శివారు పెదయాతపాలెంలో రాములోరి కల్యాణంలో వైస్ ఎంపిపి శరగడం ఝాన్సీ లక్ష్మీరాణి రాము దంపతులు పాల్గొన్నారు. మొగలిపురంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి ఆధ్వర్యంలో రాముల వారి కళ్యాణం నిర్వహించారు. వైసిపి నాయకుడు గండి రవికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.రావులమ్మపాలెంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ఎంపిటిసి చొక్కాకుల గోవింద ఆధ్వర్యంలో, తవ్వవానిపాలెం గ్రామంలో పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్, గ్రామ సర్పంచి స్వామినాయుడు ఆధ్వర్యంలో కల్యాణాలు నిర్వహించారు.కోదండ రామాలయం అభివృద్ధికి రూ. 2.15 లక్షల పరికరాలు వితరణ చేశారు. .నల్ల ఇంగుల పాలెం, రాయపుర అగ్రహారం బంగారమ్మ పాలెం గ్రామాల్లో ఎంపిటిసి ఎంపీటీసీ రాపేటి అరుణ రాము పాల్గొన్నారు

యలమంచిలి : కొత్తపేట, దిమిలి రోడ్ జంక్షన్, పాత వీధి, రామనగర్ ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు, ఆలయాల వద్ద అన్నసమారాధనను ఘనంగా జరిగాయి దిమిలి రోడ్ ఎస్‌సి కాలనీ రామాయలంలో భక్తులు ఏర్పాటు చేసిన ఐదు అడుగుల అగరబత్తిని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి వెలిగించారు.

మునగపాక: నాగులపల్లి గ్రామంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మునగపాక, చూచుకొండ గ్రామాలలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ రామాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరాపల్లి : వైసిపి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో తారువ గ్రామంలో రాములోరి కల్యాణం వేడుకగా జరిగింది. దేవరాపల్లిలో మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం, అన్నసమారాదన జరిగాయి.

వడ్డాది: బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట, ఎల్‌బిపి అగ్రహారం, వడ్డాదిలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కల్యాణంలో దొండా రవి, దొండా సతీష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక కాపు వీధి, కొత్తూరు, ఎస్‌సి కాలనీలలో శ్రీరామనవమి వేడుకల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేటలో శ్రీరామనవమి వేడుకల్లో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.. మల్లవరం, నునపర్తి, హరిపాలెం పెదపాడు, జగ్గన్నపేట, ఖాజీపాలెం, దుప్పతూరు, రామన్నపాలెం, అచ్యుతాపురం, చౌడపల్లి తదితర గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలతో పాటు అన్న సమారాధన నిర్వహించారు.

తానాంలో పాల్గొన్న సర్పంచ్ దేవి వెంకటరమణ

పరవాడ : మండలంలోని తానాం గ్రామంలో సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు.. స్వామికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ముఖ్య అతిథిగా పైలా జగన్నాథరావు పాల్గొన్నారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. మాజీ సర్పంచ్ పైలా రామారావు,పైలా కృష్ణారావు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరక వీధి కోదండ రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. రామాలయం వద్ద తాత్కాలిక కళ్యాణ వేదిక ఏర్పాటు చేసి సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వెంకన్న ఆలయ అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు ,శేషాచార్యులు, గోపాల ఆచార్యులు, సాయి, పవన్ నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు.ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కాగిత, వెదుళ్లపాలెం, సిహెచ్ లక్ష్మీపురం, చినదొడ్డిగల్లు, చందనాడ, డొంకాడ, వేంపాడు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కోటవురట్ల:మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాన శ్రీరామ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు, స్వామివారి కళ్యాణానికి భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు, మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో అన్న సమారాధన నిర్వహించారు.

నర్సీపట్నం రూరల్: వేములపూడిలో రామాలయం వద్ద శ్రీరాముని కళ్యాణం అంగరంగ వైభవం గా నిర్వహించారు. రామాలయం వద్ద అన్నసంతర్పణ నిర్వహించారు.

మాడుగుల:మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు. ఎం.కృష్ణాపురం లోని చిన్నపిల్లలతో కోలాటం, గాదిరాయిలో మహిళలతో హరిభజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కేజేపురం గ్రామంలో 24 గంటల పాటు రామనామ సంకీర్తన ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో శ్రీరామనవమి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, సతీమణి పద్మావతితో కలిసి లచ్చపాత్రుడు ఇంటి వద్ద ఉన్న వెలమ వీధి రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అయ్యన్నపాత్రుడు దంపతులు అయ్యరకవీధి, వెంకనాయుడుపేట, కొత్తవీధి, జోగనాథపాలెం, గచ్చపు వీధిలోని రామాలయాలను సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, శ్రీరామనవమి హిందువులందరికీ ఒక పవిత్రమైన, గొప్ప పర్వదినం అన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

గిరిజనులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం ఎంకే.పట్నం పంచాయతీ చటర్జీ పురం గ్రామంలో సర్వే నెంబర్ 139 సాగు వ్యవసాయ భూమిలో సాగు చేస్తున్న గిరిజన రైతులపై దాడి చేసి అరటి వ్యవసాయం తదితర పంటలను ధ్వంసం చేయడం సరి కాదని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా దొరబాబు, జిల్లా నాయకులు ములపర్తి పాదాలు, సరివెల్లి చిరంజీవి అన్నారు. ఆదివారం ధ్వంసం చేసిన పంటను పరిశీలించారు. అనంతరం దొరబాబు, మాట్లాడుతూ, ఎస్టి గదబ కులానికి చెందిన నాలుగు కుటుంబాలు పూర్వకాలం నుండి సాగు చేసుకుంటూ సాగు హక్కు పొంది ఉన్నారన్నారు. సాగులో ఉన్న గిరిజనుల వ్యవసాయ భూమిని కొంతమంది చేతులు మారుస్తూ వ్యాపారం చేస్తున్నారన్నారు. గిరిజన సాగు చేసుకుంటున్నా వ్యవసాయాన్ని ధ్వంసం చేసి గిరిజనులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి పంటకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి, తహశీల్దార్ తక్షణమే పూర్వపరాలు పరిశీలన చేసి తక్షణమే సాగులో ఉన్న గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

కళాకారులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉపమాకలో ముగిసిన సప్తాహం

- వాయిద్య కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో మెరక వీధి శ్రీ కోదండ రామాలయం వద్ద శ్రీనివాసా భజన భక్త సమాజం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సప్తాహం (భజన) ఆదివారం ఉదయం 6 గంటలకు ముగిసింది. మార్చి 30 వ తేదీ ఉదయం 6 గంటల కు ప్రారంభమైన సప్తాహం ఏప్రిల్ 6వ వ తేదీ ఉదయం 6 గంటల వరకు 7 రోజులపాటు భజన కార్యక్రమం నిర్వహించారు. అనేక గ్రామాల నుండి భజన బృంద సభ్యులు సప్తాహం కార్యక్రమంలో పాల్గొని ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు భజన కార్యక్రమం ముగియడంతో వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు శేషాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ముగింపు హారతినిచ్చారు.అనంతరం వాయిద్య కళాకారులను ఘనంగా సత్కరించారు.

మోదకొండమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగులలోని మోదకొండమ్మ అమ్మ వారిని రిటైర్డ్ విశాఖ ఎల్ఐసి డివిజన్ చీఫ్ మేనేజర్ మురళీరాజు, ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. ఆయనతో పాటు విశాఖ డివిజన్ నెంబర్ వన్ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ పాలకుర్తి సురేష్ కుమార్ (ఎల్ ఐ సి సురేష్ కుమార్)ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఎల్ఐసి అధికారులకు ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు సాదరంగా ఆహ్వానించారు. అమ్మ వారి కండువా కప్పి సత్కరించి మెమోంటో అందజేశారు.

పవన్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈనెల 7న డుంబ్రిగుడ పర్యటనలో బాగంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చాపరాయి జలపాతం లో ముత్యాలమ్మను దర్శించనున్నారు. అనంతరం గెడ్డ మీదుగా పీవిటీజీ గ్రామం పెదపాడుకు చేరుకుంటారు. పీఎం జన్మన్ గృహ నిర్మాణాలను పరిశీలించనున్నారు. గ్రామస్థులతో ముఖాముఖీగా మాట్లాడతారు. అక్కడి నుంచి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో చేరుకుని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. పవన్ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ అబిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పర్యవేక్షిస్తూ ముమ్మర ఏర్పాట్లను చేస్తున్నారు. చాపరాయి, పెదపాడు, సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. సభా ప్రాంగణంలో ఎనిమిది వేల మంది కూర్చునేలా చర్యలు చేపడుతున్నారు.

సిద్ధమైన సభా వేదిక

నేడు చాపరాయి ప్రవేశం రద్దు

ప్రజాశక్తి డుంబ్రిగుడ: ఈనెల 7న పర్యటక కేంద్రం చాపరాయి జలపాతంలో పర్యాటకుల ప్రవేశం రద్దు చేస్తున్నట్లు ఐటిడిపి ఇన్చార్జ్ పిఓ, జాయింట్ కలెక్టర్ వి అభిషేక్ గౌడ్ తెలిపారు. కొన్ని అనివార్య కారణాలతో ప్రవేశం రద్దు చేస్తున్నట్లు చెప్పారు. పర్యాటకులు దీన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పశు బీమా పథకాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రావికమతం:పశు భీమా పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యశాఖ ఏడి పుష్ప కోరారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, ఆవులు, గేదెలకు బీమా చేయించాలన్నారు. ఒకసారి ఈనని 2- 10 సంవత్సరాల వయసు గల ఆవులు, 3-12 సంవత్సరాల వయస్సు గల గేదెలకు భీమా వర్తిస్తుందన్నారు. ఈ బీమా మూడు సంవత్సరాల కాల పరిమిత వరకు పనిచేస్తుందన్నారు. మేలు జాతి ఆవులు, లేక గేదెలకు ఒక్కంటికి 30వేలు, నాటు రకం ఆవులు, గేదెలకు15 వేల చొప్పున ప్రభుత్వం భీమా చెల్లిస్తుందన్నారు. మేలు జాతి పశువులకు రూ.1920లకు గాను రైతు వాటాగా మూడు సంవత్సరాలకు రూ.288 రూపాయలు కట్టవలసి ఉంటుందన్నారు. నాటు జాతి పశు వులుకు రూ.960 చెల్లించవలసి ఉండగా రైతు వాటాగా మూడు సంవత్సరాల గాను 144 రూపాయలు చెల్లించి ఇన్సూరెన్స్ సదుపాయాన్ని పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు పశు వైద్య కేంద్రాలు, రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

పెచ్చులూడిన వసతి గృహం భవనం శ్లాబ్

శిథిలావస్థలో బాలుర వసతి గృహం

- ఊడిపడుతున్న శ్లాబ్ పెచ్చులు
- మరమ్మతుకు నోచని ఫ్లోరింగ్
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట :మండలంలోని దిబ్బిడి వెనుకబడిన తరగతుల బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి కొద్దిపాటి వర్షానికి నీరు కారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 25 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం మరమ్మతులకు గురి కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యవస్థ గృహంలో సుమారు 70 మంది విద్యార్థులు స్థానిక హైస్కూల్లో చదువుతున్నారు. విద్యార్థులు పడుకునే పలు గదులు పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. ఏ మాత్రం వర్షం కురిసినా స్లాబ్ నుండి నీరు చిమ్ముతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గదుల వద్ద ఫ్లోరింగు పెచ్చులు ఊడిపోయి ఇసుక బయటకు తేలిపోతుంది. ఎన్నో ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు పాడైపోయాయి. భవనం చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ కూడా గోడలు విరిగిపోయి పడిపోవడంతో కుక్కలు భవనంలోనికి వస్తున్నాయి. వసతి గృహం మరమ్మతులు చేపట్టి రక్షణ గోడ ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

దెబ్బతిన్న ఫ్లోరింగ్

మరమ్మతుకు నోచని రక్షణ గోడ

రోడ్డు పనులు ప్రారంభించండి

-రహదారి లేక కాలినడకన పాఠశాలకు వెళుతున్నాం - చేతులు జోడించి డొంకాడ విద్యార్థులు నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:తమ గ్రామానికి రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని గొలుగొండ మండలం కొత్తఎల్లవరం పంచాయతీ డొంకాడ పీవీటీజీ ఆదివాసీ గిరిజనులు ఆదివారం కోరారు. ఈ మేరకు తమ పిల్లలతో కలిసి మోకాళ్లపై నించోని చేతులు జోడించి వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ గ్రామంలో 180 మంది జీవనం సాగిస్తున్నారన్నారు. మా గ్రామంలో 11 మంది పిల్లలు జిల్లేడుపూడి ఎంపీపీ స్కూల్‌కు రాను పోను ఆరు కిలో మీటర్లు కాలినడక తుప్పలు, డొంకల మధ్య నుంచి నడుచుకోని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. ఎండాకాలంలో అనేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వర్షాకాలం వస్తే పాఠశాలకు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు.

గ్రామానికి కరక ఆర్అండ్‌బి రోడ్డు నుంచి డొంకాడ వరకు 2023 సంవత్సరంలో కోటి 35లక్షల రూపాయల బిటి రోడ్డు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. గత సంవత్సరం ఫారెస్ట్ అనుమతులు లేవని, రోడ్డు పనులు మొదలు పెట్టలేదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆదివాసీ గర్జన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టామన్నారు. దీనిపై కలెక్టర్ ప్రత్యేక డిఎల్‌సి ఏర్పాటు చేసి ఫారెస్ట్ అనుమతులు ఇచ్చారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినా నేటికీ పనులు మొదలుపెట్టలేదన్నారు. ఈ విషయం నర్సీపట్నం పిఆర్‌డిఈని అడగ్గా మాత్రం ఫారెస్ట్ అనుమతులు అందలేదని చెప్పారన్నారు. ఈ విషయమై కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించగా నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం నుండి జాయింట్ ఇన్స్పెక్టర్ రిపోర్టు రాలేదని, దీంతో ప్రొసిడింగ్ కాపీ ఇవ్వడానికి వీలు కాలేదని చెప్పారన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్రి పోతురాజు, కొండ తాంబలి, సత్తిబాబు పాల్గొన్నారు.

చేతులు జోడించి నిరసన చేపడుతున్న చిన్నారులు, మహిళలు

కనీస సౌకర్యాలు లేక

ఉపాధి హామీ కూలీల అవస్థలు

-పని ప్రదేశాల్లో కానరాని టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- మాడుగుల:
వేసవి ఎండలు మెండుగా ఉండటంతో ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. మండలంలో ఉన్నా అన్ని గ్రామాల్లో ఉపాధి పని చేస్తున్నారు. గతంలో కూలీలకు మజ్జిగ, తాగునీరు, సదుపాయం గతంలో కల్పించేవారని ఇప్పుడు అటువంటివి కల్పిచలేదని వాపోతున్నారు. పైగా పనులు జరుగుతున్న ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు వంటి సదుపాయాలు కల్పించడంలో అధికారులు శ్రద్ధ చూపించడం లేదని కూలీలు ఆవేదన చెందుతున్నారు. దీంతో ఉపాధి కూలీలు ఎండల్లోనే ఆపసోపాల పడుతూ పనులు చేస్తున్నారు.

మండలంలో 12,571 ఉపాధి హామీ కార్డులు ఉండగా 23,039 మంది కూలీలు పనులు చేస్తున్నారు. అయినా కనీస సదుపాయాలు కల్పించలేదు. గత నెల నుండి కూలి డబ్బులు చెల్లించలేదని, అయినా పనిచేస్తున్నామని. కూలీలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కూలి చెల్లించాలని వేసవిని దృష్టిలో ఉంచుకొని మజ్జిగ పంపిణీ చేయాలని కోరారు. పనిచేసే చోట టెంట్, మెడికల్ కిట్లు ఏర్పాటు చెయ్యాలని కోరుతున్నారు. మస్తర్లు వేయడంలో చాలా చోట్ల విఆర్పీలు చేతివాటం చూపిస్తున్నారని, పనికి రాని వారి పేరిట మస్తర్లు వేస్తున్నారన్నారు. దీంతో పని చేసిన వారికి డబ్బులు తక్కువగా వస్తున్నాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండంలోని అతిపెద్ద పంచాయతీ ఒమ్మలి పంచాయతీ ఒకటి. ఈ గ్రామంలో ఎక్కువ మంది కూలీలు ఉన్నారు. కానీ వారికి పని కల్పించడానికి వీఆర్పీ లేరు. దీంతో పనులు గుర్తించేవారే లేరు. 100 రోజుల పనికి ఏ ఒక్కరు కూడా 100 రోజులు పని పూర్తి చేయలేదు. ఇన్చార్జీలు, టీఏలు అరకొరకగా పనులు కల్పించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఉపాధి కోల్పోతున్నామని ఆ గ్రామ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుమారుగా 30రోజుల నుండి పని చేస్తున్నా ఒక్కవారం కూడా డబ్బులు అందలేదని, దీంతో నానా అవస్థలు పడుతున్నామని కూలీలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర సరుకుల కోసం అప్పులు చేయాల్సి వస్తుందని కూలీలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి కూలి డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎండల కారణంగా ఉదయం 6లేదా 7గంటలకు పనులకు వెళ్లి తిరిగి 11గంటలకు తిరిగివస్తురు. అయినా పది దాటే సరికి సూర్యుడు భగభగ మండటంతో ఎండను భరింపలేకపోతున్నారు. పని ప్రదేశాలలో టెంట్లు ఏర్పాటు చేయక పోవడంతో మండు టెండలో పనులు చేయాల్సిన పరిస్థితి కూలీలకు నెలకొంది.

మండు టెండలో పనులు చేపడుతున్న కూలీలు

జ్వరాలతో గిరిజనులు సతమతం

ప్రజాశక్తి -అనంతగిరి:విష జ్వరాలతో బాధపడుతున్న రోగులకు సకాలంలో సరైన వైద్య సేవలు అందక మంచం పట్టారు. మండలంలోని మారుమూల పెద్దకోట పంచాయతీ పరిధి మడ్రెబు గ్రామంలో గత మూడు రోజులుగా ఇంటింటా విష జ్వరాలతో బాధ పడుతున్నారు. స్థానిక ఆశా కార్యకర్త మందులు ఇచ్చినప్పటికీ తగ్గుముఖం పట్ట లేదని, తక్షణమే తమ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలు అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు ఆసుపత్రికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక అంబులెన్స్ రాని పరిస్థితిలో డోలి సహాయంతో కొండ కోనలు నడుమ కిలోమీటర్ దూరంలో ఉన్న పిన్నకోట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళవలసి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

జ్వరంతో బాధపడుతున్న చిన్నారి